గ్రామీణ క్రీడల ప్రోత్సాహమే లక్ష్యం

చింతలపూడిలో 3కే రన్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి రూపకల్పన చేశారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చింతలపూడి పట్టణంలో క్రీడాకారులతో 3కే రన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 3కే రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 47 రోజుల పాటు సచివాలయాల పరిధిలో, మండల, నియోజకవర్గ స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా ప్రావీణ్యం సంపాదించాలన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. క్రీడల్లో రాణించడం ద్వారా అత్యున్నత శిఖరాలను చేరుకోవచ్చునని సూచించారు. క్రీడల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడమే ఆడుదాం ఆంధ్ర ప్రధాన ఉద్దేశ్యమన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ టి.శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ యూసుఫ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ కాంతారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం ఇమ్మానియేలు, సర్పంచ్ యడ్ల మోహన్‌రావు, జైపాల్, ప్రసాద్‌రాజు, చుండూరి నాగేశ్వరరావు, పీడీలు పిట్టా వేణు, అత్తహర్, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



చింతలపూడిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 3కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

ఎమ్మెల్యే పరామర్శ

లింగపాలెం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మార్కెట్ యార్డు డైరెక్టర్ ముత్యాల రాధాకృష్ణను శనివారం చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పరామర్శించారు. ఇటీవల మండలంలో జరిగిన పార్టీ కార్యక్రమంలో రాధాకృష్ణ పాల్గొని తిరిగి వస్తుండగా మార్గమధ్యలో బైక్ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రాధాకృష్ణ కాలుకు తీవ్రగాయం కావడంతో ఆపరేషన్ జరిగింది. దీంతో ఎమ్మెల్యే ఎలీజా, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు రావి కొండయ్య, మందలపు నరిశింహరావు, భోగోలు సర్పంచ్ తాడేపల్లి శాంతరావు, మార్కెట్ డైరెక్టర్ కె రామకృష్ణ తదితరులు రాధాకృష్ణను పరామర్శించారు.

సచివాలయం, ఆర్‌బీకే భవనాల ప్రారంభోత్సవం

చింతలపూడి: రాష్ట్రంలో అమలవుతున్న సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. శివపురం గ్రామంలో శనివారం గ్రామ సచివాలయాన్ని, ఆర్‌బీకే భవనాలను ఎమ్మెల్యే ఎలీజా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సచివాలయం నిర్మాణానికి ఉచితంగా భూమి ఇచ్చిన స్థల దాత నరుకుళ్ళ సత్యన్నారాయణ, ఆయన కుమారుణ్ని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సర్పంచ్ నరుకుళ్ళ హరిణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకే కాక ఇతర దేశాలకు కూడా ఆదర్శప్రాయంగా నిలిచిందని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్ది అంజన్న సన్నిధిలో...


ఎమ్మెల్యే రంగనాథరాజుకి శేషవస్త్రాన్ని కప్పిన ఈవో

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామివారిని ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యే రంగరాజుకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు ఎమ్మెల్యేకి శేష వస్త్రాన్ని కప్పి సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

సామూహిక సత్యవ్రతాలు

జంగారెడ్డిగూడెం రూరల్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం రామాలయం వద్ద సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారు. అర్చకులు భక్తులచే వ్రత పూజలను చేయించారు. గురవాయిగూడెం మద్దిక్షేత్రంలో ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో ఉత్తర ద్వారంగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఆటో డ్రైవర్ల ర్యాలీ

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ప్రమాదాల నివారణకు సహకరించాలని సీఐ పీ.రాజేష్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి పొట్టిశ్రీరాములు విగ్రహం వరకు ఆటో యూనియన్ డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజేష్, ఎంవీఐ కేవీ శివప్రసాద్ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు, ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెంలోని ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు, ఐడీ పార్టీ రాజేంద్ర, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం

కొయ్యలగూడెం: శ్రీరంగపట్నంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మానికల వెంకటలక్ష్మి, నాగేశ్వరరావు కుటుంబానికి తపన ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. రూ.10 వేల విలువైన నిత్యవసర సరుకులు ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఏసుబాబు ద్వారా బాధితులకు సంస్థ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అందజేశారు. అదేవిధంగా అడ్వకేట్ నిమ్మగడ్డ రాంబాబు రూ.30 వేలు అగ్ని ప్రమాద బాధితులకు అందించారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

కొయ్యలగూడెం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఆర్ దేవి శ్రీ లక్ష్మీ పిలుపునిచ్చారు. శనివారం ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, సర్పంచ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ స్థాయిలో ఈనెల 26వ తేదీనుంచి జనవరి 9వ తేదీ వరకు, మండల స్థాయిలో జనవరి 10వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అయోధ్య అక్షింతలకు స్పర్శ పూజ

కుక్కునూరు: ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం కుక్కునూరు కొర్లకుంట రామాలయంలో అయోధ్య నుంచి వచ్చిన పూజా అక్షింతలను మండలంలో అన్ని గ్రామాలలో పంపిణీ చేసేందుకు స్పర్శపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు సుబ్బరాజు రామమందిర చరిత్రను భక్తులకు వివరించారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తపన ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికల ప్రతిభ


డీఈఓ నుంచి బహుమతిని అందుకుంటున్న బాలికలు

చింతలపూడి: జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించారు. హైస్కూల్‌లోని కె మహిత, ఎం.శ్రీవర్షిణి విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభను కనపరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. శనివారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో డీఈవో పి శ్యాం సుందర్ బాలికలకు సర్టిఫికెట్‌ను అందచేసి అభినందించారు. ఉపాధ్యాయులు కె.ప్రభాకర్‌రావు, కె రవికుమార్ పాల్గొన్నారు.

కేసుల ఎత్తివేతపై ఎస్సీల హర్షం

కొయ్యలగూడెం: ఎస్సీలపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై మండల ఎస్సీ సెల్ శనివారం హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమిర్సి బ్రహ్మయ్య, దూలపల్లి కాంతారావు, చిటిపి రవి, గెల్లా ప్రసాద్, జొన్నకూటి పట్టీ, సిర్రా కిషోర్, మాడుగుల లక్ష్మణ్, ఏలేటి బన్ను, చింటు పాల్గొన్నారు

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- శివపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

చింతలపూడి: రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. శివపురం గ్రామంలో సర్పంచ్ ఎన్ హరిణి, రవీంద్రల ఆధ్వర్యంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంతర్గత డ్రైయిన్లు అభివృద్ధి చేయాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేని కోరారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే ఎలీజా తక్షణం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన గడపగడపకూ కార్యక్రమం దోహదం చేస్తోందని తెలిపారు. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన ప్రయోజనాన్ని ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ప్రజల వద్దకు వెళ్లినప్పుడు తమను ఆదరించి నూటికి నూరు మార్కులు వేస్తున్నారని అన్నారు. పేదలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం నవరత్నాల పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నరుకుళ్ళ హరిణి, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి, ఉపాధ్యక్షుడు గుత్తా కిషోర్, నరుకుళ్ళ రవీంద్ర, రేచర్ల సర్పంచ్ కె శివ రామకృష్ణ, రాఘవాపురం సర్పంచ్ కోండ్రు వజ్రకిషోర్, యండపల్లి సర్పంచ్ యడ్ల మోహన్‌రావు, ఎం.ఇమ్మానియేలు, ఎస్.కాంతారావు, పెనుబోయిన నాగబాబు, చుండూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


శివపురంలో మహిళకు అందిన పథకాలను వివరించి బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

ప్రకృతి సాగుతో ఖర్చు తక్కువ

రాష్ట్ర రైతు సాధికార సంస్థ సలహాదారు ప్రభాకర్‌రెడ్డి

ద్వారకాతిరుమల: తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని పొందాలంటే ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని రాష్ట్ర రైతు సాధికార సంస్థ సలహాదారు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండుగొలనుకుంటలో ప్రకృతి వ్యవసాయ పంటలను శనివారం పరిశీలించిన ఆయన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ మండల ఇన్‌చార్జి ఒబిలిశెట్టి గోపాలకృష్ణతో మాట్లాడి, ప్రకృతి వ్యవసాయంలో చేపడుతున్న మెలకువలను అడిగి తెలుసుకున్నారు. గోపాలకృష్ణ నిర్వహిస్తున్న ఎన్‌పీఎం షాపును పరిశీలించి, సాగుదారుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో రైతును రాజుగా.. రారాజుగా మార్చేందుకు గోపాలకృష్ణ కృషి చేస్తున్నారన్నారు. 30 రకాల నవధాన్యాల విత్తనాలతో భూమి సాగు చేయడం ద్వారా వానపాములు, పాజిటివ్ బ్యాక్టీరియ కలసి 'గేమ్ చేంజర్'గా' మారి భూసారం పెరుగుతుందన్నారు. మానవుడు సంపూర్ణ ఆరోగ్యం పొందాలంటే విష రసాయనాలు లేని నూరుశాతం ప్రకృతి వ్యవసాయం ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. రసాయనాల వాడకం తగ్గించి, సేంద్రియ, సంప్రదాయ ఎరువులను, 30 రకాల నవధాన్యాలను పీఎండీఎస్ పద్ధతిలో పెంచి, ఒక ఆవుతో 25 ఎకరాల వ్యవసాయాన్ని చేయొచ్చన్నారు. మన గోవులు, పశువుల పేడ, మూత్రంతో మన ఇళ్లలోనే ఘన, జీవామృతాలను తయారు చేసుకోవచ్చన్నారు. వాటితో విత్తన శుద్ధి, మన పొలాల్లో లభించే ఆకులు, అలములతో కషాయాలు చేసుకోవచ్చన్నారు. ఆ కషాయాలతో ప్రకృతి సహజమైన విధానంలో సాగు చేపట్టి బోర్డర్ పంటలు, రక్షిత పంటల విధానం ద్వారా అద్భుతమైన వ్యవసాయ దిగుబడులు సాధించవచ్చన్నారు. దీని ద్వారా మంచి ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


గుండుగొలనుకుంటలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన దోసకాయిలను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి


జంగారెడ్డిగూడెం: భక్తులకు దర్శనమిస్తున్న పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి


పోలవరం రూరల్: గూటాలలో లక్ష్మీ నరసింహ స్వామి ఊరేగింపు


లింగపాలెం: రంగాపురంలో స్వామివారి ఊరేగింపు సందర్భంగా కోలాట ప్రదర్శన


కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామిని భక్తులు శనివారం ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దంపతులు, జెడ్పీటీసీ పాల్నాటి బాబ్జి, మున్సిపల్ చైర్మన్ బత్తిన నాగలక్ష్మి, బత్తిన చిన్న, కమిషనర్ భవానీ ప్రసాద్, వందనపు సాయిబాల పద్మ, వెంకటేశ్వరరావు, ఆర్డీవో కె.అద్దయ్య, డీఎస్పీ ఎం.ధనుంజయుడు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. సీఐ రాజేష్, ఎస్సై మల్లికార్జునరెడ్డి బందోబస్తు ఏర్పాట్లు చేశారు

పోలవరం రూరల్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పోలవరం మండలంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు గోదావరి నదీ స్నానాన్ని ఆచరించి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. లక్ష తులసి పూజ, విష్ణు సహస్ర పారాయణలు నిర్వహించారు. గూటాల గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాతామూర్తి విగ్రహాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు.

కొయ్యలగూడెం: శయన ఏకాదశి (ముక్కోటి) పూజలు శనివారం వైష్ణవ క్షేత్రాలలో ఘనంగా నిర్వహించారు. కొయ్యలగూడెం లోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో దేవేరులతో సహా స్వామివారి ఉత్తరాభిముకుడై భక్తులకు దర్శనమిచ్చాడు.

లింగపాలెం: రంగాపురంలోని శ్రీ సత్యదేవుని ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారు ఉత్తర ద్వారం వైపు విశేష అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, వైఎస్సార్ సీపీ నాయకులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఎస్సై పోస్టుకు ఎంపికైన సీతారామ్

లింగపాలెం: ఇటీవల జరిగిన ఎస్సై పరీక్షా ఫలితాలలో ఉత్తీర్ణత సాధించి వేములపల్లికి చెందిన మద్దల సీతారామ్ సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. తల్లి తండ్రులు సత్యవాణి, సత్యన్నారాయణ వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తుంటారు. సీతారామ్‌కు భార్యా సంధ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీతారామ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సూర్యప్రకాశరావుకు సన్మానం

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో ఇటీవల నూతనంగా నియమితులైన వైఎస్సార్ సీపీ పశ్చిమ గోదావరి జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు వందనపు సూర్యప్రకాశరావును సత్కరించారు. సర్పంచ్ గెల్లా వెంకట రమణ, ఎంపీపీ కొదమ జ్యోతి, పార్టీ శ్రేణులు సూర్యప్రకాశరావుకు శేషవస్త్రాన్ని కప్పి సన్మానించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం: ప్రతి వ్యక్తి వస్తువు కొనుగోలు చేసిన వెంటనే బిల్లు తీసుకుని భద్రపరుచుకోవాలని మండల వినియోగదారుల కౌన్సిల్ అధ్యక్షుడు కె.రామచంద్రరావు సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వినియోగదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధాన కార్యదర్శి హీరా హకీమ్, కౌన్సిల్ ఉపాధ్యక్షుడు పి.భాస్కర్‌రావు మాట్లాడుతూ ఎవరైనా నష్టపోతే తమ కౌన్సిల్‌ను సంప్రదించాలని కోరారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

బుట్టాయగూడెం: మండలంలోని కోటనాగవరం, సీతప్పగూడెం, నిమ్మలగూడెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఫిషర్స్ సర్వే ఆఫ్ ఇండియా సీనియర్ సైంటిస్ట్ జీవీఏ ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు.

నేత్రపర్వం.. శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం


శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు


వెండి గరుడ వాహనంపై ఉభయ దేవేరులతో క్షేత్ర పురవీధులకు పయనమైన శ్రీవారు

ద్వారకాతిరుమల: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనంలో శ్రీవారిని భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజామునుంచి శ్రీవారి క్షేత్రం భక్తులతో పోటెత్తింది.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యం.ధనుంజయుడు కోరారు. శనివారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయం వద్ద పలు శాఖాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెంలో అత్యధికంగా రోడ్డు ప్రమాదంలో 36 మంది మృతి చెందారన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లు గుర్తించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిక్షణ డీఎస్పీ బి.విద్య, మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్, ఎన్‌హెచ్ 516 ఏఈ సబీనా, ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.బేబీ కమల, సీఐ రాజేష్, మానవతా మూర్తి, ఎస్సై మల్లికార్జునరెడ్డి, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

సొసైటీ మాజీ చైర్మన్ చాట్రాతి శేషగిరిరావు మృతి


శేషగిరిరావు (ఫైల్)

టి.నర్సాపురం: టి.నర్సాపురం సహకార సంఘ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్ చాట్రాతి శేషగిరిరావు (74) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈయన గత రెండు రోజులుగా అనారోగ్యానికి గురై రాజమండ్రి ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని మండలంలోని పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సందర్శించి నివాళులర్పించారు. టి. నర్సాపురంలో శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.